సాక్షి
ఖమ్మం
శుక్రవారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2024

న్యూస్‌రీల్

దుర్గాదేవి అవతారంలో అమ్మవారు



దుర్గాదేవి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఎనిమిదో రోజుకు చేరాయి. తొలుత స్వామికి పంచామృతంతో అభిషేకం, స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు మహా చండీ హోమం చేశారు. ఆతర్వాత అలివేలుమంగ అమ్మవారిని శ్రీదుర్గాదేవి రూపంలో అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉప ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ, రాజీవశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు రెసిడెన్షియల్ పాఠశాలలకు శంకుస్థాపన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్ర, శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 11గంటలకు బోనకల్ మండలం లక్ష్మీపురంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత మధిరకు చేరుకుని రాత్రి బస చేయనున్న భట్టి, శనివారం దసరా వేడుకల్లో పాల్గొంటారు.

మంత్రి పొంగులేటి, తుమ్మల..

రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఉదయం పొన్నెకల్లులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత కూసుమంచి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశమై రాత్రి స్వగ్రామమైన నారాయణపురం వెళ్తారు. శనివారం ఉదయం ఎర్రుపాలెం మండలం జమలాపురం, తక్కెళ్లపాడుల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొన్నాక 11గంటలకు అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం పామాయిల్ ఫ్యాక్టరీలో పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి హాజరవుతారు. అలాగే, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం మధ్యాహ్నం 2.30గంటలకు రఘునాథపాలెం మండలం జింకల తండాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం బూడిదంపాడు, సూర్యాతండా, పుటానితండాలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయనున్నారు.


ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంకుస్థాపనకు ఏర్పాట్లుపూర్తి



సభా ప్రాంగణంలో వేస్తున్న టెంట్లు

బోనకల్: మధిర నియోజకవర్గానికి సంబంధించి బోనకల్ మండలం గోవిందాపురం (ఎల్)లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల శంకుస్థాపనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క శుక్రవారం ఉదయం నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు పైలాన్ నిర్మాణం, టెంట్ల ఏర్పాటు ఇతర పనులు పూర్తయ్యాయని తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పులకించిన పుడమి!

▸ ఊరూవాడ ఘనంగా సద్దుల బతుకమ్మ ▸ ఉత్సాహంగా ఆడిపాడిన ఆడబిడ్డలు ▸ సందడిగా మారిన పల్లె, పట్నం



ఖమ్మంలో మున్నేరు వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఒక్కేసి పువ్వేసి చందమామా అంటూ తొమ్మిది రోజుల క్రితం మొదలైన బతుకమ్మ సంబురాలు సద్దుల బతుకమ్మతో గురువారం ముగిశాయి..



ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల్లో స్థిరపడిన ఆడబిడ్డలు స్వస్థలాలకు చేరుకుని బంధుగణం, స్నేహితులతో కలిసి ఉదయం నుంచే బతుకమ్మలు పేర్చడంలో నిమగ్నమయ్యారు.

రంగురంగుల్లోని తీరొక్క పూలను సేకరించి సిద్ధం చేసిన బతుకమ్మలతో సాయంత్రం జలాశయాలు, శివారు ప్రాంతాలకు చేరుకోవడంతో ఆయా ప్రాంతాలు కొత్త అందాన్ని సంతరించుకున్నాయి.



బతుకమ్మలను ఒక చోటకు చేర్చి చుట్టూ తిరుగుతూ ఆడిపాడిన మహిళలు, చిన్నారులు వెళ్లిరా గౌరమ్మా అంటూ జలాశయాల్లో నిమజ్జనం చేశారు.

ఆపై మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకుని ఇళ్లకు బయలుదేరారు.

మున్నేరులో బతుకమ్మను నిమజ్జనం చేస్తున్న చిన్నారి



వెంకటేశ్వరనగర్‌లో బతుకమ్మల చుట్టూ ఆడిపాడుతున్న మహిళలు, యువతులు



బతుకమ్మల వద్ద పూజ చేస్తున్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి





కుమార్తెలతో సెల్ఫీ దిగుతున్న తల్లి

మరికొన్ని ఫొటోలు III లో..

జనవరికల్లా మద్దులపల్లి మార్కెట్

- రెండు కళ్లలా అభివృద్ధి, సంక్షేమం
- రూ.18వేల కోట్ల మేర రైతుల రుణాలను మాఫీ చేశాం..
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మరో మంత్రి తుమ్మల, తదితరులు

ఖమ్మంరూరల్: మద్దులపల్లి మార్కెట్‌లో నిర్మాణాలను రాబోయే జనవరికల్లా పూర్తిచేయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో తమ ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. మద్దులపల్లి మార్కెట్ ఆవరణలో గురువారం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. తొలుత పొంగులేటి మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ.18వేల కోట్ల మేర రుణాలు మాఫీ చేశామని, మిగతా రూ.13వేలు కోట్లు త్వరలోనే మాఫీ చేస్తామని తెలిపారు. రూ.2లక్షలు పైబడి రుణాలు ఉన్న రైతులు పైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే వారికి కూడా రుణమాఫీ అవుతుందని వెల్లడించారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ నేతలు రైతులకు రూ.11వేలు కోట్లు రుణమాఫీ చేస్తే.. తాము ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అంతకు మూడింతలు మాఫీ చేస్తున్నామని చెప్పారు. కాగా, ప్రతీ నియోజకవర్గంలో 25 ఎకరాల విస్తీర్ణంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మించనున్నట్లు పొంగులేటి తెలిపారు. అలాగే, ప్రతీ నియోజకవర్గానికి 3,500 నుండి 4వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనకు తాము సిద్ధమైతే ప్రధాన ప్రతిపక్షం నేతలు పేదలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. త్వరలోనే ధరణి స్థానంలో నూతన ఆర్‌ఓఆర్ చట్టాన్ని ప్రవేశపెడతామని పొంగులేటి తెలిపారు.

రైతు సంక్షేమం కోసమే తాపత్రయం

రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం తాపత్రయపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పార్టీని అంటిపెట్టుకుని ఉన్న కార్యకర్తలకు పదవులు ఇస్తున్నామన్నారు. పాలేరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించడంతో భూముల ధర రూ.కోట్లలో పలుకుతోందని తెలిపారు. పాలేరు నియోజకవర్గానికి నలువైపులా జాతీయ రహదారులు ఉన్నాయన్నారు. ఈ ఏడాది నుంచి సన్న ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించనున్నామని పేర్కొన్నారు. అలాగే, పంటల బీమా, రైతుభరోసా కూడా అమలుచేస్తామన్నారు. పాలేరు నియోజకవర్గ రైతులు ఆయిల్‌పామ్ సాగుకు ముందుకురావాలని తుమ్మల సూచించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథ్‌బాబు, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, బాలసాని లక్ష్మీనారాయణ, మద్ది మల్లారెడ్డి, సాధు రమేష్‌రెడ్డి, కన్నేటి నర్సింహారావు, బోడా వెంకన్న, బండి జగదీష్, భూక్యా సురేష్‌నాయక్, చింతమళ్ల రవి, రామసహాయం నరేష్‌రెడ్డి, ఎండీ.హఫీజుద్దీన్, తేజావత్ పంతులు నాయక్, సీపీఐ నాయకులు ఎండీ.మౌలానా, దండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సుపారీ తీసుకుని కిడ్నాప్

- పాతకక్షలతో అపహరించాలని నగదు చెల్లించిన గంధసిరి వాసి
- ఆపై కిడ్నాప్.. డబ్బు తీసుకుని వదిలేసిన ముఠా
- అనంతరం మళ్లీ కానుల కోసం డిమాండ్
- ఎనిమిది మందిని అరెస్ట్ చేసిన ముదిగొండ పోలీసులు



పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న కార్లతో సీఐ మురళి, పోలీసులు

ముదిగొండ: పాతకక్షల నేపథ్యాన ఓ వ్యక్తిని కిడ్నాప్ చేయాలని డబ్బు చెల్లించగా.. ముఠాగా ఏర్పడిన కొందరు కిడ్నాప్ చేయడమే కాక సదరు వ్యక్తి నుంచి డబ్బులు దండుకున్న వైనమిది. అంతేకాక బెదిరించి మళ్లీ డబ్బులు వసూలుచేయగా పోలీసులను ఆశ్రయించడంతో ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ముదిగొండ సీఐ ఓ.మురళి గురువారం వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

మహిళ నేతృత్వాన...

ముదిగొండ మండలం గంధసిరికి చెందిన పస్తం ఏసురాజు, అదే గ్రామానికి చెందిన పస్తం రామరాజు మధ్య పాతకక్షలు ఉన్నాయి. దీంతో ఏసురాజును కిడ్నాప్ చేసి ఆయన నుంచి డబ్బు వసూలు చేయాలని రామరాజు పథకం రూపొందించాడు. ఈనేపథ్యాన ఏసురాజును కిడ్నాప్ చేయాలని వెంకటగిరికి చెందిన దగ్గుపాటి రమాదేవికి రూ.50వేలు నగదు చెల్లించాడు. ఆమె తన అనుచరులైన కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేష్‌కు చెప్పగా వారు వాసికర్ల సాయికృష్ణ కమతం వినీత్‌తో ముఠాగా ఏర్పడి కిడ్నాప్‌కు పథకం రూపొందించారు. ఇందులో కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేష్‌కు అడ్వాన్స్‌గా రూ.50వేలు నగదు చెల్లించారు. దీంతో గత నెల 25వ తేదీన రాత్రి ఏసురాజు, అంజయ్య మరికొందరు కారులో కమలాపురం నుంచి గంధసిరి వస్తుండగా రామరాజుతో పాటు కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేష్, వాసికర్ల సాయికృష్ణ, కమతం వినీత్, పలిమెల ప్రవీణ్ కలిసి మామిళ్లమ్మ దేవాలయం వద్ద ఏసురాజు కారును ఆపి బలవంతంగా వేరే కారులో ఎక్కించుకుని ఖమ్మం కొత్త బస్టాండ్ వద్దకు తీసుకెళ్లారు. రూ.లక్ష ఇస్తేనే వదిలిపెడతామని లేకపోతే చంపుతామని బెదిరించడంతో ఆయన ఫోన్ పే ద్వారా కంచర్ల నాగేశ్వరరావుకు రూ.60వేలు పంపించాడు. మిగిలిన నగదును రెండు రోజుల్లో ఇస్తానని చెప్పడంతో వారు ఏసురాజును వదిలేశారు. ఆతర్వాత మళ్లీ ఫోన్ చేసి బెదిరించడంతో రెండు సార్లు రూ.16,500 ఫోన్ పే ద్వారా పంపాడు. ఘటనపై ఈనెల 8న ఏసురాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ మురళి రెండు బృందాలను ఏర్పాటుచేసి గాలింపు చేపట్టారు. ఇందులో భాగంగా మూడు కార్లలో పారిపోతున్న పస్తం రామరాజు, దగ్గుపాటి రమాదేవి, కంచర్ల నాగేశ్వరరావు, దాసరి రమేష్, వాసికర్ల సాయికృష్ణ, కమతం వినీత్, పలిమెల ప్రవీణ్, గంధం అంజయ్య పట్టుబడ్డారని సీఐ తెలిపారు. వీరి నుంచి 10 సెల్‌ఫోన్లు, మూడు కార్లు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఇదే ముఠా గతంలో తొర్రూరు ప్రాంతంలోనూ కిడ్నాప్‌కు పాల్పడ్డారని తెలిపారు. కాగా, నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన ఎస్‌ఐ నరేష్, ట్రెయినీ ఎస్‌ఐ రోహిత్, సిబ్బందిని సీఐ అభినందించారు.

అనాథలమనే భావన విడనాడండి

- మీకు అండగా అధికార యంత్రాంగం
- బాలలసదనం పిల్లలతో భోజనం చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



బాలల సదనం పిల్లలతో కలిసి భోజనం చేసి మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందనే విషయాన్ని గుర్తించి శ్రద్ధగా చదువుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఖమ్మంలోని బాలల సదనాన్ని గురువారం రాత్రి సందర్శించిన ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీజ, అసిస్టెంట్ మ్రిణాల్ శ్రేష్టతో కలిసి పిల్లలతో బతుకమ్మ ఆడిపాడారు. ఆతర్వాత పిల్లలందరినీ ఓ రెస్టారెంట్‌లో డిన్నర్‌కు తీసుకెళ్లి వారితో కలిసి భోజనం చేశారు. ఆపై పిల్లల భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్న కలెక్టర్ మాట్లాడుతూ అనాథలమనే భావనను విడనాడాలని, యంత్రాంగమంతా అండగా ఉంటుందని తెలిపారు. శ్రద్ధ చదువుకునేలా అన్ని అవకాశాలు కల్పిస్తామని, తరచుగా చారిత్రాత్మక, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కె రాంగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన భగీరథ కార్మికులు

70 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా



కార్యాలయం వద్ద బైఠాయించిన కార్మికులు, నాయకులు

కూసుమంచి: మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్‌తో విధులు బహిష్కరిస్తున్నట్లు పాలేరు మిషన్ భగీరథ ప్రాజెక్టు కార్మికులు ప్రకటించారు. సీఐటీయూ, టీఆర్ఎస్‌కేవీ యూనియన్లకు చెందిన కార్మికులు గురువారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం పది రోజుల క్రితమే వేతనాలు విడుదల చేసినా కంపెనీ ప్రతినిధులు, మిషన్ భగీరథ అధికారులు జమ చేయలేదని.. ఫలితంగా దసరా పండుగకు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. వేతనాలు ఇచ్చేంత వరకు విధుల్లో చేరేది లేదని, నీటి సరఫరాలో అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు. కాగా కార్మికుల సమ్మెతో కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో 70 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

ఖమ్మంలో రతన్ టాటా...

1983లో వచ్చిన పారిశ్రామిక దిగ్గజం



ఖమ్మం వచ్చిన రతన్ టాటాతో వెంకటరామారావు, పాపారావు (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ టాటా 1983లో ఖమ్మం వచ్చారు. గాంధీచౌక్‌లో వ్యాపారవేత్త కాళ్ల వెంకట రామారావు తెలంగాణ ఏజెన్సీస్‌ను నెలకొల్పగా, నేషనల్ రేడియో ఎలక్ట్రానిక్స్ కంపెనీ డీలర్ షిప్ తీసుకున్నారు. అంతేకాక ఈ కంపెనీ డీలర్ల రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈమేరకు నేషనల్ రేడియో ఎలక్ట్రానిక్స్ కంపెనీ డీలర్‌షిప్ ప్రారంభోత్సవానికి ఆహ్వానించగా రతన్‌టాటా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెంకటరామారావు కుమారుడు పాపారావు, బొమ్మిడి శంకరలింగం తదితరులు పాల్గొన్నారు. కాగా, రతన్‌టాటా మృతితో తెలంగాణ ఏజెన్సీస్ యాజమాన్య బాధ్యులు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి వ్యాపారులను ప్రోత్సహించే గుణం కలిగిన గొప్ప వ్యక్తి అంటూ స్మరించుకున్నారు.

■ **ఖమ్మం వన్‌టౌన్:** భారత పారిశ్రామిక రంగంలో రతన్‌టాటాకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన మృతి ప్రపంచానికే తీరని లోటని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపార రంగంలో నిబద్ధతకు, విలువలకు కట్టుబడిన గొప్ప వ్యక్తి అని తెలిపారు.

క్లుప్తంగా

శ్రీ దుర్గాదేవి అలంకరణలో పెద్దమ్మతల్లి


దుర్గాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

పాల్వంచరూరల్ : శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పెద్దమ్మతల్లి అమ్మవారు శ్రీ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రాతఃకాలార్చన, శ్రీలక్ష్మీగణపతి హోమం, వేద పారాయణం, నవగ్రహ జపాలు, శ్రీచక్రార్చన, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, సువర్ణ పుష్పార్చన, సుహాసినీ పూజలు నిర్వహించారు. ముత్తయిదువను అమ్మవారుగా భావించి షోడశ ఉపచారాలతో శ్రీ సూక్త విధానంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

వాళ్లిద్దరూ.. స్కూల్ అసిస్టెంట్లు


నియామకపత్రంతో రమేష్, రత్నకుమారి

కొణిజర్ల: భార్యాభర్తలిద్దరు ఒకేసారి డీఎస్సీ-2024లో భాగంగా స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగాలకు ఎంపికవడంతో అభినందలు వెల్లువెత్తుతున్నాయి. కొణిజర్ల మండలం తనికెళ్లకు చెందిన కవిడ రమేష్ ప్రస్తుతం కొణిజర్ల మండలం రెడ్డిగూడెం ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తిస్తూ డీఎస్సీ సాంఘిక శాస్త్రం విభాగంలో జిల్లా స్థాయి 21వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. ఆయన భార్య రత్నకుమారి భద్రాద్రి జిల్లా నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా సోషల్ స్టడీస్‌లో 29వ ర్యాంకుతో ఎస్ఏ పోస్టుకు, 100వ ర్యాంకుతో ఎస్జీటీ పోస్టుకు ఎంపికవడం విశేషం. ఈ మేరకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్న రమేష్-రత్నకుమారిని గ్రామస్తులు అభినందించారు.

దుకాణాల్లో పోలీసుల తనిఖీలు


భద్రాచలం పట్టణంలో పోలీస్ జాగిలంతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ పరిధిలోని పాన్ షాపులు, కిరాణా షాపులలో నిషేధిత గంజాయి మత్తు పదార్థాలు గుర్తించడానికి పోలీస్ జాగిలంతో గురువారం తనిఖీలు నిర్వహించారు. నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలతో గురువారం భద్రాచలం పట్టణ పరిధిలోని బస్టాండ్, పాన్ షాపలు, కిరాణ షాప్, మొదలగు ప్రాంతల్లో తనిఖీలు చేపట్టినట్లు టౌన్ సీఐ సంజీవరావు తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధించిన గంజాయి, మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఉంటే ప్రజలు వెంటనే డయల్ 100 లేదా 8712682106 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శిగా కిషన్‌నాయక్


కిషన్ నాయక్

సుజాతనగర్: ఈ నెల 7,8 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన సంఘం పీఆర్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరిగాయి. ఆ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సర్వారం గ్రామానికి చెందిన కిషన్ నాయక్‌ను ఎన్నుకున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,043

‘బుగ్గవాగు’ లక్ష్యం నెరవేరేనా..?

చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయినా.. కనిపించని కాల్వలు

- ఆయకట్టు రైతుల ఎదురుచూపులు
- ఏళ్ల క్రితమే నిధుల కేటాయింపు, టెండర్ల ఖరారు
- భూ సేకరణకు నోచుకోక పెండింగ్‌లో..


బుగ్గవాగు వరద ప్రవాహం (ఫైల్)

ఖమ్మంఅర్బన్: బుగ్గవాగు వరదతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాగు, తాగు అవసరాలు తీర్చాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. జిల్లాలోని పలు మండలాల మీదుగా బుగ్గవాగు ప్రవహిస్తూ మున్నేరులో కలుస్తోంది. దీంతో పరీవాహక మండలాల్లో పంటల సాగుతో పాటు తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ఖమ్మం ఎమ్మెల్యేగా ఉన్న సమయాన 2010లో చెక్‌డ్యాం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. చెక్‌డ్యాం నిర్మాణం పూర్తయినా భూసేకరణ నోచుకోక కాల్వల పనులు మొదలుకాలేదు.

1,500 ఎకరాలకు సాగునీరు..

కారేపల్లి మండలం పింజరమడుగు సమీపాన బుగ్గవాగుపై చెక్ డ్యాం నిర్మించి ఎలాంటి సాగునీటి వనరులు లేని ప్రాంతాలకు కాల్వ ద్వారా సాగునీరు అందించాలన్నది ఈ ప్రాజెక్టు లక్ష్యం. దాదాపు 21.7 కి.మీ. కాల్వల ద్వారా 27 చెరువులు నింపేలా ప్రణాళిక రూపొందించారు. వీటికి అనుసంధానంగా 18 కి.మీ. మేరా బ్రాంచి కాల్వల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లోని గొలుసు చెరువులకు నీరందించేలా డిజైన్ రూపొందించారు. ఇదంతా పూర్తయితే సుమారు 1,500 ఎకరాలకు సాగునీరు అందేది. భారీ వర్షం కురిసి వాగుకు వరద వచ్చినప్పుడల్లా ఈ కాల్వల ద్వారా చెరువులు నిండడమే కాక పరిసరాల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుంది. తద్వారా సాగు పెరుగుతుందని.. చేపల పెంపకంతో మత్స్యకారులకు ప్రయోజనంగా ఉంటుందని భావించారు.

ప్రతిపాదనలకే సరి..

చెక్‌డ్యాం నిర్మాణం రూ.8.14 కోట్లతో పనులు పూర్తి కావడంతో కాల్వ నిర్మాణానికి రూ.37.18కోట్లు


చింతగుర్తి చెరువు (ఫైల్)

కేటాయించి 2020లో టెండర్లు కూడా ఖరారు చేశారు. కానీ భూసేకరణ పూర్తికాక ఆ తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో ముందడుగు పడలేదు. రెండేళ్ల క్రితం మంచుకొండ ప్రాంతంలో భూసేకరణకు జలవనరులశాఖ, రెవెన్యూ అధికారులు సర్వే కోసం వెళ్లగా రైతులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వెనక్కి వచ్చిన అధికారులు మళ్లీ అటు వైపు చూడలేదు.

వృథా నీరు సద్వినియోగం..

ఈ ప్రాజెక్టుతో పూర్తయితే అదనపు ఖర్చు లేకుండానే మున్నేటిలో వృథాగా కలిసే నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. మోటార్లు వినియోగించే అవసరం లేకుండా అడ్డుకట్ట ద్వారా వరద వచ్చిన ప్రతీసారి చెక్‌డ్యాం నుంచి కాల్వల ద్వారా చెరువులకు నీటిని మళ్లించే అవకాశం ఏర్పడుతుంది. కానీ ప్రాజెక్టుకు భూసేకరణపై అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దగా పట్టించకోకపోవడంతో రైతులకు ప్రయోజనం కలగడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా దృష్టి సారించాలని మూడు మండలాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

తాజాగా రూ.26.77 కోట్లతో ప్రతిపాదనలు..

రెండు నెలల క్రితం రఘునాథపాలెంకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా బుగ్గవాగు ప్రాజెక్టుపై ఆరా తీయగా ప్రస్తుత స్థితిగతులను అధికారులు వివరించారు. ఆపై భూసేకరణ కోసం రూ.26.77 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది. మొత్తం ప్రాజెక్టు పరిధిలో కాల్వల నిర్మాణానికి జలవనరుల శాఖ అధికారులు ఈ ప్రతిపాదనలు సమర్పించగా మోక్షం లభిస్తుందా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

చెరువు భూములు ఆక్రమణకు గురికావొద్దు..

- సర్వే చేయించి ట్రెంచ్ కొట్టించండి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం: చెరువు శిఖం భూములను పూర్తిస్థాయిలో సర్వే చేయించి ఎక్కడా ఆక్రమణలు జరగకుండా ట్రెంచ్ కొట్టించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అలాగే, రోడ్లు, డ్రెయినేజీ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించేలా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం, చింతగుర్తి, గణేశ్వరం, చెరువు కొమ్ము తండా, వేపకుంట్లలో అభివృద్ధి పనులకు అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశాక మంత్రి మాట్లాడారు. వీ.వీ.పాలెంలోని ఎత్తిపోతల పథకం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయాలని, తాగునీటి సరఫరాలో సమస్యలు పరిష్కరించాలని సూచించారు. రాష్ట గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, వీవీపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు, ఎంపీడీఓ అశోక్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ లూర్ధ్ విల్సన్, పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, డీఈ మహేష్, ఏఈ చిరంజీవితో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, సాధు రమేష్‌రెడ్డి, బండి నాగేశ్వరరావు, గుత్తా వెంకటేశ్వర్లు, మల్లీదు జగన్, బాలాజీనాయక్, తమ్మినేని నాగేశ్వరరావు, యరగర్ల హన్మంతరావు, మాలోత్ లక్ష్మి, సీతారామయ్య, కొమరయ్య, ధరావత్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేయాలి..

ఖమ్మంవన్‌టౌన్: దసరా పండుగ నాటికి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి లోలెవల్ కాజ్‌వే డైవర్షన్ రోడ్డు పనులు పూర్తి చేసి రాకపోకలను ప్రారంభించాలని రాష్ట మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఖమ్మం 28వ డివిజన్‌లోని ప్రకాష్‌నగర్‌లో స్టోమ్ వాటర్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వద్ద పనులను పరిశీలించి మాట్లాడారు. రాష్ట గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, కమర్తపు మురళి, కొప్పెర ఉపేందర్‌తో పాటు బాలసాని లక్ష్మీనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్‌రెడ్డి, తుపాకుల యలగొండల స్వామి, పాలెపు వెంకటరమణ పాల్గొన్నారు.

కేటీసీ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు విడుదల

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్టులో ఓబీ, కోల్ పనులు నిర్వహించే ఎల్ఎస్ఎన్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఎట్టకేలకు వేతనాలు అందాయి. వేతనాలు, బోనస్ చెల్లించాలని బుధవారం రాత్రి హెల్పర్లు, డ్రైవర్లు, ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు ఆందోళన చేపట్టిన విషయం విదితమే. దీంతో గురువారం కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ చేశారు. కంపెనీలో సుమారు 400 మంది పని చేస్తున్నారు. వీరికి ప్రతీ నెల కోటి రూపాయల వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది. ఈసారి దసరా పండుగ బోనస్ సుమారు రూ.70 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. సింగరేణి తరఫున కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5 వేలు ఇవ్వాల్సి బోనస్‌ను యాజమాన్యం ఇప్పటికే కాంట్రాక్టర్ ఖాతాలో జమ చేసింది. వేతనంతోపాటు రెండు బోనస్‌లు వస్తాయని కార్మికులు ఆశించగా, నిరాశే ఎదురైంది. కేవలం వేతనం మాత్రమే జమ చేశారు. సింగరేణి బోనస్ వారం రోజుల్లో ఇస్తామని, తాము ఇచ్చే బోనస్ కూడా త్వరలోనే చెల్లిస్తామని ఎల్ఎస్ఎన్ కంపెనీ కేటీసీ ఇన్‌చార్జి రాజమోహన్‌రెడ్డి తెలిపారు. కాగా బోనస్ కూడా చెల్లించాలని ట్రేడ్ యూనియన్ల నాయకులు దుబాకుల ప్రసాద్, పాయం వెంకన్న తదితరులు డిమాండ్ చేశారు.

విద్యార్థినికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న బొర్రా యూత్ గ్రూపు సభ్యులు, పే బ్యాక్ సొసైటీ బాధ్యులు..

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి దిద్దిపూడికి చెందిన పానెం శ్రీహర్షిత ఇటీవల వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. అయితే, నిరుపేద కుటుంబం కావడంతో ఫీజులు, ఇతర ఖర్చులకు ఎదురవుతునఇక్కట్లపై ఈనెల 3న ‘చదువుల తల్లిని కనికరించని లక్ష్మీదేవి’ శీర్షికన ‘సాక్షి’లో కథనం ప్రచురితం కాగా దాతలు ముందుకొస్తున్నారు. ఇప్పటికే ఆమెకు రూ.3.51 లక్షల మేర ఆర్థికసాయాన్ని అందించారు. అలాగే, గురువారం బొర్రా యూత్ వాట్సాప్ గ్రూపు సభ్యులు రూ.22,500, అయిలూరి లక్ష్మీ జ్ఞాపకార్థం ఆమె కుమార్తె, ఎన్ఆర్ఐ శీలం కిరణ్మయి రూ.10 వేలు, పే బ్యాక్ టూ సొసైటీ వ్యవస్థాపకుడు జంగం లక్ష్మణరావు రూ.10 వేలు అందించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావుతో పాటు శీలం వెంకటనర్సిరెడ్డి, మిట్టపల్లి నాగి, పొదిలి హరినాథ్, డి.ప్రతాప్, నవ్యకాంత్, డి.జగదీష్, కె.విజయ్, డి.రవికుమార్, ఎండీ.నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడికి అభినందన

జూలూరుపాడు: కబడ్డీ అసోసియేషన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన లేళ్ల వెంకటరెడ్డిని గురువారం పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు, దుద్దుకూరి మధుసూదన్‌రావు, సొసైటీ డైరెక్టర్ కల్యాణపు నరేష్, దొండపాటి శ్రీనివాసరావు, అల్లాడి లింగారావు, వందనపు సత్యనారాయణ, గాదె కృష్ణయ్య, జవ్వాజి వీరరాఘవులు, నర్వనేని పుల్లారావు, వేల్పుల నరసింహారావు, ఎం.రామక్రిష్ణ, వి.గోపాలక్రిష్ణ, బి.హాతిరామ్, ఎం.గోపి, పి.సతీష్, ఎం.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈజీఎస్ టీఏ కుటుంబానికి చేయూత


నగదు అందజేస్తున్న డీఆర్‌డీఓ, తదితరులు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరానికి చెందిన ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్(టీఏ) మందా నాగేశ్వరరావు ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబానికి ఈజీఎస్ ఉద్యోగులు చేయూత అందించారు. ఈ మేరకు గురువారం ఆయన కుటుంబాన్ని డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఏపీడీ సీహెచ్.శ్రీనివాసరావు, మధిర ఎంపీడీఓ పరామర్శించారు. అలాగే, ఈజీఎస్ ఉద్యోగులు సేకరించిన రూ.72వేల నగదును అందజేశారు. టీఏల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పగిడిపల్లి మనోహర్ రావు, ఆవుల సంతోష్‌కుమార్‌తో పాటు గద్దల భాస్కర్, రేలచెర్ల అనిల్‌కుమార్, కె.నాగరాజు, ఇనపనూరి నాగేశ్వరరావు, ఆర్.కాంతమ్మ, జంగం లక్ష్మయ్య, మాతంగి నాగరాజు, ఎస్.వెంకటేశ్, అనిల్‌కుమార్, దారా సుధాకర్, సుజాత, రియాజ్, రాజశేఖర్, డేవిడ్‌రాజు, నంద్రు గోపాల్, బి.ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మరింత చేరువగా ఆర్టీసీ

- క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తెచ్చిన యాజమాన్యం
- స్కాన్ చేస్తే పది రకాల యాప్‌లు వినియోగించుకునే అవకాశం
- ప్రయాణికులకు సేవలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు


క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

చుంచుపల్లి: ఆధునిక సాంకేతికతను ఆర్టీసీ అందిపుచ్చుకుంటోంది. ఇప్పటికే సాంకేతికత ఆధారంగా బస్సుల్లో సీట్ల రిజర్వేషన్, వివిధ సందర్భాల్లో డిజిటల్ లావాదేవీలను విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ సేవలు ప్రజలకు కొంత వెసులుబాటుగా మారాయి. వేగంగా, సౌకర్యవంతంగా సేవలు అందించడంతోపాటు ప్రయాణికులకు ఆన్‌లైన్ సేవలు మరింత చేరువ చేయాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ క్రమంలోనే సంస్థ ప్రత్యేకంగా కొత్తగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది. క్యూఆర్ కోడ్ (క్విక్ రెస్పాన్స్) సాయంతో ఉన్న చోటు నుంచే ఆర్టీసీ సేవలను పొందడానికి వీలవుతుంది. ఈ విధానం పాతదే అయినా సంస్థ దీనిని ఆధునికీకరించింది. దీన్ని స్కాన్ చేస్తే పది రకాల సేవలు కనిపిస్తాయి. ఆన్‌లైన్ బస్ టికెట్ బుకింగ్, వెబ్‌సైట్, గమ్యం యాప్, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఇనిస్టాగామ్, ఎక్స్, యూట్యూబ్, ఫేస్బుక్, వాట్సాప్ చానల్ ఉంటాయి. గమ్యం యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులకు ఉపయోగపడేలా వేర్వేరు రకాల యాప్ సర్వీసులు ఒకే చోట ఉంటాయి. ఏ విభాగం అవసరం ఉంటే దాన్ని ప్రయాణికులు ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది.

అవగాహన కార్యక్రమాలు

ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు నాలుగు డిపోల పరిధిలోకి వచ్చే మండలాలు, గ్రామాల్లో అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. స్కూళ్లు, కాలేజీలు, వ్యాపార సముదాయాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్ల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లను అంటిస్తున్నారు. వీటితోపాటు ఫ్లెక్సీల ద్వారా నేరుగా ప్రజలకు అవగాహన పరుస్తున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ ఈ పది రకాల సేవలను విడివిడిగా అందిస్తుండగా జనాల్లో ఆశించినంత స్పందన లేదు. వెబ్‌సైట్లను బ్రౌజ్ చేసే, ఆర్టీసీ సోషల్ మీడియా పేజీలను వీక్షించే వారి సంఖ్య అంతగా ఉండటం లేదు. సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడం ద్వారా సేవలను మరింత సులభతరం చేసే వీలుంటుందని ఆర్టీసీ అధికారుల భావిస్తున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలకు ఆర్టీసీ అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రయాణికులు క్యూఆర్‌కోడ్‌ను స్కానింగ్ చేసి యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఒకసారి మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ పొందుపరిస్తే ఎప్పుడైనా వినియోగించుకోవచ్చునని అధికారులు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీలో కొత్తగా ప్రవేశ పెట్టిన క్యూఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఇందులో ఆర్టీసీ అందిస్తున్న సేవలన్నీ ఒకే చోట పొందేలా ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ సేవలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లేందుకు స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లు, తదితర రద్దీ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నాం. – **దేవేందర్‌గౌడ్, డీఎం, కొత్తగూడెం**

పశువుల వాహనం సీజ్

పాల్వంచరూరల్: అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. మోరంపల్లి బంజర నుంచి హైదరాబాద్‌కు పశువులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం బీజేపీ నాయకులు ఇందిరానగర్ కాలనీవద్ద అడ్డగించారు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగంగా వెళ్తుండగా వెంబడించి బస్టాండ్ సెంటర్‌లో పట్టుకుని పోలీసులకు అప్పగించారు. 30 వరకు పశువులను తరలిస్తుండగా వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ జి.భాస్కర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాహనాన్ని అడ్డుకున్న వారిలో రవినాయక్, గంధం నాగేంద్రప్రసాద్, బొమ్మినేని క్రాంతికుమార్, నరేష్, బట్టుశివ, వంశీకుమార్ ఉన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

కామేపల్లి: ద్వి చక్రవాహనం చోరీకి గురైన ఘటన మండలంలోని పండితాపురంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్మినేని నగేష్ బుధవారం మధ్యాహ్నం ముచ్చర్ల క్రాస్ సమీపాన రోడ్డు పక్కన బైక్‌ను నిలిపి పక్కనే ఉన్న తన పొలంకు వెళ్లాడు. పొలంలో పని ముగిశాక వచ్చేసరికి బైక్ లేకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జూనియర్ కాలేజీలో కంప్యూటర్...

వైరా: వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఈ నెల 6న కళాశాలకు దసరా సెలవులు ప్రకటించగా అధ్యాపకులు తాళాలు వేశారు. అయితే, సిబ్బంది కళాశాల పనుల నిమిత్తం గురువారం ఉదయం వచ్చేసరికి ఆఫీస్‌రూం తాళాలు పగులగొట్టి ఉండడంతో ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రిన్సిపాల్ చేరుకుని రూ.30వేల విలువైన కంప్యూటర్ మానిటర్ సీపీయూ చోరీ జరిగినట్లు గుర్తించి ఎస్సై ఏ.వంశీకృష్ణ భాగ్యరాజ్‌కు ఫిర్యాదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్...


ధ్వంసమైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కోరగుట్ట సమీపంలో ఉన్న వ్యవసాయ భూమిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న విలువైన కాపర్‌ను చోరీ చేశారు. చోరీ ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ట్రాన్స్‌కో ఏఈ రవి తెలిపారు.

పట్టపగలు బంగారు ఆభరణాలు...

చుంచుపల్లి: పట్టపగలు విద్యానగర్‌లో బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన గురువారం జరిగింది. కొత్తగూడెం రైటర్ బస్తీలో నివాసం ఉంటున్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి వి.వెంకటేశ్వరరావు పోస్టాఫీస్ ఎస్‌బీఐ బ్రాంచ్ లాకర్‌లో ఉన్న బంగారం విడిపించుకుని కారులో విద్యానగర్ చేరుకున్నారు. అక్కడ ఓ సూపర్ మార్కెట్‌లో కిరాణ సామగ్రి కొనుగోలు చేసి కారు డిక్కీలో సర్దుతున్నాడు. ఈ క్రమంలో కారు ముందు సీటులో కవర్‌లో ఉంచిన 19 తులాల బంగారు ఆభరణాలను ఆటోలో వచ్చిన వ్యక్తి దొంగిలించి పరారయ్యాడు. బాధితుడు చుంచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేపట్టారు.

చోరీకి గురైన ‘విద్యుత్’ వైరు గుర్తింపు

కూసుమంచి: విద్యుత్ శాఖకు సంబంధించిన కండక్టర్ వైరు చోరీ కాగా, ఆ వైరును కూసుమంచిలోని ఓ పాత ఇనుప దుకాణంలో గుర్తించారు. ఇటీవల వరదలు వచ్చినప్పుడు గుర్తు తెలియని దుండగులు వైరును చోరీ చేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేస్తుండగా పాత ఇనుప దుకాణంలో కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని ఏలువారిగూడెంలో గత నెల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... మద్దికుంట్ల ఉపేందర్‌రెడ్డి(42) గత నెల 12న మోటార్ సైకిల్‌పై వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబసభ్యులు ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఉపేందర్‌రెడ్డి కుటుంబీకుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రూ.1.20 కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



కొత్త ట్రాన్స్‌ఫార్మర్ వద్ద డీఈ, ఉద్యోగులు

కొణిజర్ల: గ్రామాల్లో లోఓల్టేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి శాఖాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఖమ్మం డీఈ(ఆపరేషన్స్) నంబూరి రామారావు తెలిపారు. కొణిజర్ల మండలం తనికెళ్ల సబ్‌స్టేషన్‌లో రూ.1.20కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్, కొత్త బ్రేకర్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తనికెళ్ల చుట్టుపక్కల గ్రామాల్లో నానాటికీ పెరుగుతున్న నిర్మాణాలు, వెంచర్లు, వ్యవసాయ కనెక్షన్ల కారణంగా ప్రస్తుత ట్రాన్స్‌ఫార్మర్‌పై భారం పడి లో ఓల్టేజీ సమస్య వస్తోందన్నారు. దీన్ని అధిగమించేందుకు కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఈ ఎంఆర్‌టీ భద్రుపవార్, ఏడీఈ తిలక్, రాందాస్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జీఎం(సీపీపీ)గా బాధ్యతల స్వీకరణ



మనోహర్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ (సీపీపీ) జనరల్ మేనేజర్‌గా ఏ.మనోహర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ బాధ్యతలు నిర్వర్తించిన జక్కం రమేష్ ఉద్యోగ విరమణ చేయగా కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎంగా ఉన్న మనోహర్‌రావును నియమించారు. 1988లో మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎంజీటీ)గా విధుల్లో చేరిన ఆయన 2021లో ఆర్జీ–3 జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది ఆర్జీ–1, 2, మందమర్రి ఏరియాల జీఎంగా పనిచేశారు. 2024లో కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ జీఎంగా కొత్తగూడెం వచ్చిన మనోహర్‌రావు ప్రస్తుతం జీఎం(సీపీపీ)గా నియమితులయ్యారు.

'విందు వద్దు... బకాయిలు చెల్లిస్తే చాలు'

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగులు, కార్మికులకు విందు ఏర్పాటుచేయడం కాకుండా ప్రభుత్వం నుంచి రూ.33వేల కోట్ల బకాయిలు చెల్లించాలని బీఎంఎస్ నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం సామూహిక భోజనాల పేరుతో కార్మికుల దృష్టి మరల్చేందుకు ప్రయత్నం చేస్తోందని తెలిపారు. కార్మికులే గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద దసరా వేళ విందు ఏర్పాటు చేసుకునే సాంప్రదాయం ఉండగా.. ప్రభుత్వం కార్మికుల కష్టార్జితంతో ఏర్పాటుచేయడమేంటని ప్రశ్నించారు. ఈ విషయంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ప్రభుత్వంతో చేతులు కలిపి కార్మికులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

మానసిక దివ్యాంగులకు ఉచిత న్యాయసాయం



వృద్ధులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి చంద్రశేఖర్‌రావు

ఖమ్మం లీగల్: మానసిక దివ్యాంగులకు న్యాయ సేవాధికార సంస్థ తరఫున ఉచితంగా న్యాయసాయం అందిస్తామని ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్ రావు అన్నారు. మానసిక దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం పోలేపల్లిలోని మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగులకు వసతులు కల్పించి, అవసరమైన చికిత్స చేయించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం ఆయన పండ్లు పంపిణీ చేశారు. డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మల్లిబోయిన వలరాజు, ఆశ్రమ నిర్వాహకులు చార్మిల్ రోస్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లన్నీ కిటకిట..



ఖమ్మం రాపర్తినగర్: 15 రోజులకు పైగా రద్దయిన పలు రైళ్ల రాకపోకలు ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఇంతలోనే దసరా సెలవులు కావడంతో స్వ స్థలాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్న వారితో రైళ్లన్నీ కిక్కిరిసి కనిపిస్తున్నాయి. ఖమ్మం మీదుగా వెళ్లే శాతవాహన, గోల్కొండ, ఇంటర్ సిటీతోపాటు ప్యాసింజర్లు రైళ్లలో సైతం కాలు పెట్టే స్థలం కానరావడం లేదు. అయితే, పలు రైళ్లు గంటల కొద్ది ఆలస్యంగా నడుస్తుండడంతో పిల్లలు, వృద్ధులతో స్టేషన్లలో జనం పడిగాపులు కాయాల్సి వస్తోంది. ట్రాక్ పనుల కారణంగా రైళ్లు కాస్త ఆలస్యంగా నడుస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.

చి'వరి'కి నీరేది..?



మిట్టపల్లి మైనర్ కింద ఎండిపోతున్న పొలంలో రైతులు

- నీరందక ఎండుతున్న సాగర్ ఆయకట్టు
- మేజర్ల నుంచి మైనర్లకు నీటి సరఫరా గగనమే
- ఫలితంగా చివరి ఆయకట్టులో వడబడుతున్న వరి పైర్లు
- కాల్వలు అధ్వానంగా మారడమే ప్రధాన కారణం



కేశ్వాపురం వద్ద పిచ్చి మొక్కలు పెరిగి మూసుకుపోయిన పుణ్యపురం మేజర్ కాల్వ



అధ్వానంగా మారిన తల్లాడ మైనర్ కాల్వ

తల్లాడ: ఈ ఏడాది కృష్ణా పరీవాహకంలో సమృద్ధిగా కురిసిన వర్షాలతో నాగార్జునసాగర్ జలాశయం నిండింది. ఇక రెండు పంటలు పండుతాయని రైతులు సంతోషించారు. ఇంతలోనే జిల్లాలో భారీ వర్షాలతో పాలేరు వద్ద సాగర్ కాల్వకు గండి పడి కొన్నిరోజులు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత నీరు విడుదల చేసినా సాగర్ పరిధి పలుచోట్ల మేజర్, మైనర్ కాల్వల నిర్వహణ ఏళ్లుగా మరిచిపోవంతో అధ్వానంగా తయారై ఆయకట్టుకు సరిపడా నీరు అందడం లేదు. ప్రధానంగా సాగర్ చివరి ఆయకట్టు భూములకు నీరు అందని కారణంగా వరి పైర్లు వడబడిపోతున్నాయి. ఈ ఖరీఫ్‌లో తల్లాడ సబ్ డివిజన్ పరిధిలో 30 వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేయగా.. మేజర్ కాల్వల మీదుగా మైనర్లు, మేజర్ల పరిధిలోని కాల్వల చివరి భూములకు నీరందక ఈ పరిస్థితి నెలకొంది.

మేజర్లకు కటకట..

తల్లాడ మండలంలోని సిరిపురం, పుణ్యపురం మేజర్ల పరిధిలోని మైనర్ల కింద ఉన్న కొడవటిమెట్ట, నారాయణపురం, మల్లవరం, పినపాక, తెలగవరం, నూతనకల్, మిట్టపల్లి, కేశ్వాపురంల్లో పైర్లకు నీరందడం లేదు. రైతులు రేయింబవళ్లు కాల్వల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మిట్టపల్లి, నూతనకల్ రైతులు పుణ్యపురం మేజర్ కాల్వ షట్టర్ వద్ద ఇటీవల నీటి సామర్థ్యం పెంచాలని ఆందోళన చేశారు. అంతేకాక పుణ్యపురం మేజర్ పరిధిలోని రైతులు కల్లూరు ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని వాపోతున్నారు.

పిచ్చిమొక్కలు.. పగిలిన యూటీలు

సాగర్ కాల్వలను 40 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆ తర్వాత కొన్నాళ్లు నిర్వహణ బాగానే ఉన్నా తొమ్మిదేళ్లుగా మరమ్మతులు చేయలేదు. దీంతో కాల్వలు అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఏమని ఆరా తీస్తే నిధులు లేవనే సమాధానం వస్తోంది. పలుచోట్ల మేజర్ కాల్వల డ్రాప్‌లు, యూటీలు పగిలిపోగా కాల్వ కట్టలు బలహీనంగా మారాయి. మిగిలిన ప్రాంతాల్లో కాల్వల నిండా కంపచెట్లు, పిచ్చి చెట్లు, గడ్డి పెరిగి నీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. తల్లాడ మండలంలోని 34 మైనర్ల పరిస్థితి అలాగే ఉండగా.. నీరు విడుదల చేసినా ముందుకు సాగక చివరి ఆయకట్టు ఎండిపోతోంది.

170 క్యూసెక్కులు కాదు.. 120 మాత్రమే

మేజర్ కాల్వలకు 170 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా 120 క్యూసెక్కులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. అలాకాక 170 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే కాల్వ కట్టలు బాగాలేనందున గండి పడే అవకాశముంది. దీంతో పాటు మైనర్ కాల్వలకు సైతం తక్కువ స్థాయిలోనే నీటిని విడుదల చేస్తుండగా చివరి ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

పొట్ట దశలో పైర్లు

వరి పైరు ప్రస్తుతం పొట్ట దశలో ఉంది. ఆగస్టులో వేసిన నాట్లు పొట్ట దశకు రావడంతో నీటి అవసరం ఎక్కువ. కానీ సరిపడా నీరందక పైరు వడబడిపోతోంది. ఈ నేపథ్యాన నీటి సామర్థ్యం పెంచి తమను ఆదుకోవాలని లేకపోతే తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని రైతులు కోరుతున్నారు.

అన్నీ అవాంతరాలే..



సిరిపురం మేజర్ పరిధిలో వరి పైరుకు నీరందడం లేదు. సాగర్ కాల్వల మరమ్మతు చేయక సరఫరాకు అవాంతరాలు ఎదురవుతున్నాయి. వరి పొట్ట దశలో నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. అధికారులు స్పందించి చివరి భూములకు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– రెడ్డెం కృష్ణారెడ్డి, రైతు, నారాయణపురం

చివరి భూములకూ నీరు



గత వారంతో పోలిస్తే ఇప్పుడు పరిస్థితి మెరుగైంది. ఇప్పుడు అన్ని మేజర్లు, మైనర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. పుణ్యపురం మేజర్ పరిధిలో సమస్యలు ఉన్నా చివరి భూములకు నీరందేలా పర్యవేక్షిస్తున్నాం. వరి సాగు చేసిన రైతులు నష్టపోకుండా సాగునీరు అందిస్తాం.

– వి.శ్రీనివాసరావు, జలవనరుల శాఖ డీఈ, తల్లాడ

శ్రీకోటమైసమ్మ జాతరకు సిద్ధం





జాతరకు ముస్తాబైన శ్రీ కోటమైసమ్మ తల్లి ఆలయం (ఇన్‌సెట్) ఆలయంలో అమ్మవారు

- రేపటి నుంచి 16వ తేదీ వరకు జాతర
- మూడు జిల్లాల నుంచి తరలిరానున్న భక్తజనం
- దేవాదాయ శాఖ, పర్సా ట్రస్ట్ తరఫున ఏర్పాట్లు



ఆలయ ఆవరణలో కొలువుదీరిన శంకరుడు



ఇరవై అడుగుల ఆంజనేయ విగ్రహం

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారంగా నిలిచే శ్రీ కోట మైసమ్మ తల్లి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే జాతరకు వేలాదిగా భక్త జనం తరలివస్తారు. ప్రభబండ్లతో వచ్చేభక్తజనం అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

రెండు జిల్లాల సరిహద్దులో..

ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం – భద్రాద్రి జిల్లా ఇల్లెందు సరిహద్దులోని ఉసిరికాయపల్లిలో కొలువుదీరిన శ్రీకోటమైసమ్మ తల్లి జాతరను దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కారేపల్లి, కామేపల్లి, రఘునాథపాలెం మండలాలతో పాటు భద్రాద్రి జిల్లా ఇల్లెందు, టేకులపల్లి, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం, డోర్నకల్ మండలాల నుంచి భక్తులు తరలివస్తారు. ఈ మేరకు భక్తుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభి రామారావు తెలిపారు.

ప్రత్యేక ఆకర్షణగా దేవతామూర్తులు

కోటమైసమ్మ జాతరలో ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అంతేకాక ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తున్నాయి. శంకరుడి విగ్రహంతో పాటు 20 అడుగుల ఎత్తుతో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం, వినాయకుడు, శ్రీ సరస్వతీ దేవి విగ్రహాలు భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. ఇక జాతరకు వచ్చే భక్తులు, పిల్లలకు వినోదం, ఆహ్లాదాన్ని పంచేందుకు సర్కస్ ఏర్పాటవుతోంది. రెండు జాయింట్ వీల్స్, ఒక కొలాంబో తదితర సర్కస్ ఫీట్లతో భక్తులు ఉల్లాసంగా గడిపే అవకాశం ఉంది.

విద్యుత్ ఆర్టిజన్లను ఉద్యోగులుగా గుర్తించాలి

పాల్వంచ: విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్లకు గత ప్రభుత్వంలో తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా కన్వర్షన్ చేసి ఉద్యోగులుగా గుర్తించాలని ఆర్టిజన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్ కోరారు. పాల్వంచలోని ఏఐటీయూసీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి బానోతు శంకర్ ఆధ్వర్యాన గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 23వేల మంది కార్మికులు ఉద్యోగ భద్రత లేక ఆందోళన చెందుతున్నారన్నారు. వీరితో వెట్టిచాకిరి చేయిస్తున్న ప్రభుత్వం ఏపీఎస్ఈబీ నిబంధనల మేరకు అందరికీ కన్వర్షన్ చేసి పదోన్నతులు కల్పించాలన్నారు. ఈ మేరకు డిమాండ్‌తో ఈనెల 17న వరంగల్‌లో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. సంఘం నాయకులు కె.కృష్ణ, శారద, ఇట్టి వెంకట్రావు, భూక్యా రాములు, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

రుణమాఫీలో తాత్సారం సరికాదు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల లోపు రైతుల రుణాలను మాఫీ చేయాలని, రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తాత్సారం చేయడం సరికాదని సీపీఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇకనైనా అర్హులైన రైతులందరి రుణాలు మాఫీ చేయడంతో పాటు రేషన్‌కార్డుల జారీకి మార్గదర్శకాలు విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఎండీ.మౌలానా, దండి సురేష్, సిద్దినేని కర్ణకుమార్, చెరుకుపల్లి భాస్కర్, అజ్మీరా రామ్మూర్తి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో 'వంట' వివాదం

- ప్రైవేట్ కార్యక్రమానికి వంట చేయించారని ఫిర్యాదు
- సత్తుపల్లి పాత యూపీఎస్ హెచ్‌ఎం డిప్యూటేషన్



పాత సెంటర్ యూపీఎస్‌లో వంట చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సత్తుపల్లి: సత్తుపల్లిలోని పాత యూపీఎస్ హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్ తల్లి వీరమ్మ చిన్నకర్మ రోజున చేయించిన వంటపై వివాదం ఏర్పడింది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులతో బుధవారం వంటకాలు చేయించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ అంశంపై కొందరు డీఈఓ సోమశేఖరశర్మకు ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలతో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని చిత్తలూరి ప్రసాద్‌కు ఎంఈఓ సక్కా రాజేశ్వరరావు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇంతలోనే ప్రసాద్‌ను కొణిజర్ల ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ విషయమై చిత్తలూరి ప్రసాద్ మాట్లాడుతూ తన తల్లి వీరమ్మ క్రిస్టియన్ మతం స్వీకరించిందని తెలిపారు. వీరికి చిన్నకర్మ వంటివి నిర్వహించరని, వంటలతో తనకు సంబంధం లేదని చెప్పారు.

ఎమ్మెల్యే తనిఖీతో మొదలు...

గతేడాది డిసెంబర్ 18న సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాతసెంటర్ యూపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా డిసెంబర్ 17న విద్యార్థులను పిక్నిక్‌కు తీసుకెళ్లడమే కాకుండా మరుసటిరోజు 18న సెలవు ప్రకటించడంపై హెచ్‌ఎంను ప్రశ్నించారు. అయితే హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్ ఇచ్చిన వివరణ సంతృప్తిగా లేదని, ఆయన కనీస మర్యాద పాటించలేదంటూ కలెక్టర్, డీఈఓకు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. దీంతో క్రమశిక్షణ చర్యల కింద ఆయనను ఏన్కూరుకు డిప్యూటేషన్‌పై బదిలీ చేయగా, కోర్టును ఆశ్రయించి తిరిగి పాత యూపీఎస్‌కు వచ్చారు. ఈ విషయమై వివాదం మళ్లీ రాజుకుంది. హెచ్‌ఎంపై నిష్పక్షపాతంగా విచారణ చేయకుండా, ఫిర్యాదుదారులను విచారించకుండా తిరిగి ఇక్కడే పోస్టింగ్ ఇచ్చారని స్పీకర్‌కు సైతం ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇటీవల కిష్టారం పర్యటనకు వచ్చిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిసింది.

ప్రజాసంఘాలను బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాచర్ల భారతి

పెనుబల్లి: ప్రజల సమస్యలపై పోరాడుతూ పరిష్కారానికి పాటుపడేలా ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి సూచించారు. పెనుబల్లి మండలం వీఎం బంజర్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీపీఎం అనుబంధ సంఘాలతో పాటు ప్రజా సంఘాలను బలోపేతం చేయడంతో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుపోవచ్చన్నారు. ఈ సమావేశంలో నాయకులు మాదినేని రమేష్, చలమాల విఠల్‌రావు, గాయం తిరుపతిరావు, కండె సత్యం తదితరులు పాల్గొన్నారు.

'ఉజ్వల సింగరేణి'పై అవగాహన

కార్మికులు, ఉద్యోగులకు విందు భోజనాలు



మాట్లాడుతున్న డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఉజ్వల భవిష్యత్‌కు ఉద్యోగుల పాత్ర కీలకమని డైరెక్టర్ (పీ అండ్‌పీ) వెంకటేశ్వరరెడ్డి, అన్నారు. కార్మికులు, ఉద్యోగులకు ఏర్పాటు చేసిన దసరా విందు సందర్భంగా కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ స్టోర్స్, మెయిన్ ఆస్పత్రి సిబ్బందితో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంస్థ స్థితిగతులు, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, లాభాల్లో వృద్ధి, వివిధ రంగాల్లో విస్తరణతో పాటు భవిష్యత్ ప్రణాళికపై ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రైవేట్ కంపెనీలతో పోల్చితే ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని వినియోగదారులకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని కోరారు. ప్రధానంగా భూగర్భ గనుల్లో ఉత్పత్తి వ్యయం తగ్గించాలని, రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. సంస్థ భవిష్యత్‌లో మనుగడ సాగించాలంటే బహుముఖ వ్యాపార విస్తరణ చేయాలని, బొగ్గు మాత్రమే కాకుండా ఇతర ఖనిజ పరిశ్రమల్లోనూ విస్తరించేలా యాజమాన్యం కృషి చేస్తోందని తెలిపారు.

బొగ్గు కంటే ఇతర ఆదాయాలే ఎక్కువ..

సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తిపై 30 శాతం, ఇతర పెట్టుబడులపై 70 శాతం ఆదాయం గడిస్తోందని, ఇలా కొనసాగితే కంపెనీ భవిష్యత్ కష్టమవుతుందని డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు అన్నారు. ఇప్పటికే సోలార్, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించగా.. బ్యాటరీ ఎనర్జీ, మెటల్, నాన్ మెటల్ సంపద ఉత్పత్తికి కూడా ప్రణాళికలు చేపడుతున్నామని వివరించారు. పోటీ ప్రపంచాన్ని తట్టుకోవాలంటే నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వంగా వెంకట్, రమణమూర్తి, పీతాంబరం, త్యాగరాజన్, ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

చింతకాని: వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు చింతకాని ఎస్సై నాగుల్ మీరా తెలిపారు. ఖమ్మం నుంచి ఏపీలోని వత్సవాయి మండలం లింగాల గ్రామానికి రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మండలంలోని జగన్నాథపురం వద్ద రేషన్ బియ్యం లోడుతో వెళ్తున్న వ్యాన్ పట్టుబడింది. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న నర్సింహారావుతో పాటు డ్రైవర్ వేముల నాగబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముస్తాబైన బస్‌షెల్టర్



ప్రారంభానికి సిద్ధమైన బస్‌షెల్టర్, ఇందిరా క్యాంటీన్

ఖమ్మం కలెక్టరేట్ వద్ద నిర్మించిన బస్‌షెల్టర్ ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. జూలై మొదటి వారంలో నిర్మాణం ప్రారంభించగా చకచకా పనులు చేపట్టారు. బస్‌షెల్టర్‌తో పాటు దీనికి ఆనుకుని ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ సైతం నిర్మించారు. ఎక్కడా లేని విధంగా ఆకట్టుకునే రీతిలో నిర్మించిన బస్‌షెల్టర్‌లో బెంచీలు సైతం ఏర్పాటుచేశారు. ఇన్నాళ్లు బస్‌షెల్టర్ లేకపోవడంతో ఉద్యోగస్తులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ షెల్టర్‌తో పాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ సైతం నిర్మాణం చేయించారు.

– ఖమ్మం సహకారనగర్

ఆర్టీసీకి దసరా రద్దీ..



కిక్కిరిసిన బస్సులో ఎక్కుతున్న ప్రయాణికులు

- కిక్కిరిసి వెళ్తున్న బస్సులు
- ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిట
- ఉద్యోగులకు భోజనం సమకూరుస్తున్న యాజమాన్యం

సత్తుపల్లిటౌన్: తెలంగాణలో పెద్ద పండుగైన దసరా సందర్భంగా దూర ప్రాంతాల్లో ఉన్న వారు స్వస్థలాలకు వస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. ఖమ్మం రీజియన్‌లోని ఖమ్మం, సత్తుపల్లి, మధిర, భద్రాచలం, మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు బస్టాండ్లు, బస్సులు కిక్కిరిసి కనిపిస్తుండగా.. బస్సులు ప్లాట్‌ఫాంపైకి రాకముందే పరుగులు తీస్తున్నారు.

రద్దీకి అనుగుణంగా..

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అధికారులు బస్సులు తిప్పుతున్నారు. సంస్థకు ఆదాయాన్ని పెంచడం, ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ఇప్పటికే ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి 22 రెగ్యులర్ సర్వీస్‌లతో పాటు ఈనెల 8న, 12 సర్వీసులు, 9వ తేదీన 15, 10వ తేదీన మరో 15 చొప్పున అదనపు సర్వీసులు ఏర్పాటుచేశారు.



ఉద్యోగులకు భోజనం అందజేస్తున్న అధికారులు

ప్రత్యేక పర్యవేక్షణ

బస్టాండ్లు, బస్సుల్లో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. బస్టాండ్లను శుభ్రంగా ఉంచటంతో పాటు తాగునీరు సమకూరుస్తున్నారు. అలాగే, డ్రైవర్లు, కండక్టర్లకు సమయం వృథా కాకుండా ఈసారి డిపోల్లోనే యాజమాన్యం భోజన సదుపాయాన్ని కల్పించింది. ఆర్టీసీ డీఎం, అసిస్టెంట్ మేనేజర్, ఎంఎఫ్, సూపర్‌వైజర్లు బస్టాండ్లలోనే మకాం వేసి పర్యవేక్షిస్తూ రద్దీగా అనుగుణంగా బస్సులు ఏర్పాటుచేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి..



దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులనే ఎంచుకోవాలి. తద్వారా సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకుని పండుగను ఆనందంగా జరుపుకోవచ్చు. హైదరాబాద్ నుంచి రెగ్యులర్ బస్సులతో పాటు అదనపు బస్సులు ఏర్పాటు చేశాం.

– యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ డీఎం, సత్తుపల్లి